పెండింగ్ ప్రమోషన్లను వెంటనే చేపట్టాలి



మంత్రి నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ అధికారుల సంఘం నేతలు

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ శాఖలో పెండింగ్ ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని, 317 జీవోలో బదిలీ అయిన ఉద్యోగులకు పాత సర్వీస్ లెక్కించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం నేతలు శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ డి.వైద్యనాథ్, నాయకుడు శశిధర్‌రెడ్డిలు బాగ్‌లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

హైకోర్టు ఏపీపీ రాంచంద్రారెడ్డికు సత్కారం



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా నియమితులైన సీనియర్ న్యాయవాది ఎం.రాంచంద్రారెడ్డికి శనివారం ఆయన కార్యాలయంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్లు జి.రామారావు, వెంకట తిప్పారెడ్డి కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి.

ప్రొ.శేషగిరిరావును పరామర్శించిన సంజయ్



నల్లకుంట డివిజన్‌లోని న్యూరామాలయం వీధిలో ప్రొఫెసర్ శేషగిరిరావును ఆయన నివాసంలో శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆత్మీయంగా పలుకరించి, పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, నాయకులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న జనహక్కుల పోరాట సమితి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్

'కల్లు గీత'కు పాలకమండలిని ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కల్లు గీత కార్పొరేషన్‌కు పాలక మండలిని ఏర్పాటు చేసి 5 వేల కోట్ల నిధులు కేటాయించాలని జనహక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, జాతీయ సెక్రటరీ జనరల్ రాగుల సిద్ధిరాములుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 18 నాటికి ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసి, జనగామ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలేశం గౌడ్, ముత్యం నర్సింహులుగౌడ్, బాలస్వామి సురేష్‌గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్; రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

నల్లకుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యారంగంలో ప్రావీణ్యం సాధించి, ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని సెయింట్ మేరీ హైస్కూల్ కరస్పాండెంట్ వై. వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని సెయింట్ మేరీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి విద్యార్థులకు మంచి నడవడిక నేర్పేది ఉపాధ్యాయులేనని అన్నారు. హైస్కూల్ ఇన్‌చార్జి ఎం.స్వరూప, ఉపాధ్యాయులు వి.సరిత, తబుసమ్, మనీష, భారతి, విజయలక్ష్మి, మైథిలీ, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఒబైదుల్లా కొత్వాల్‌కు సత్కారం



తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఒబైదుల్లా కొత్వాల్‌ను గోల్నాక డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.రాంమోహన్‌రావు నేతృత్వంలో నాయకులు షేక్‌అబ్దుల్లా, షేక్ మహ్మద్‌అలీ, మహ్మద్ ఫయాజ్, మహ్మద్‌షఫీ, మహ్మద్‌మోహీజ్ కలిసి సత్కరించారు. - గోల్నాక



మాట్లాడుతున్న రూపసదాశివ, స్వామి, భాస్కర్ తదితరులు

12 నుంచి చేనేత ఎక్స్‌పో

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడానికి, ఆత్మహత్యలను నివారించడానికి ప్రతిఒక్కరూ చేనేతవస్త్రాలను ధరించాలని పద్మశాలీ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 12, 13, 14వ తేదీలలో పద్మశాలీ భవన్‌లో చేనేత ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు రూపసదాశివ, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి భాస్కర్‌లు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో 45 చేనేత స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం : రాజయ్య

పంజాగుట్ట, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించాలని, ఎక్కువ నిధులు కేటాయించి సంస్కరణలు తేవాలని, విద్యపై నిర్లక్ష్యంతో ఒక్క తరానికి కూడా అన్యాయం చేయకూడదని వారన్నారు. జవహర్ బాల్‌మంచ్(జేబీఎం)సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న విద్యామిషన్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ చైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి తదితరులు హాజరై మాట్లాడారు. ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా విద్యావంతులైన మానవ వనరులు లేకపోతే అభివృద్ధి అసాధ్యమని అన్నారు. అత్యధిక యువత కలిగిన దేశాన్ని పటిష్టమైన దేశంగా మార్చాలంటే విద్యతోనే సాధ్యమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యను పటిష్ఠం చేసే లక్ష్యంతో తీసుకొస్తున్న విద్యామిషన్‌కు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యారంగంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తూ క్షేత్రస్థాయిలో అమలుపై దృష్టి సారించాలని సూచించారు.



బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ తదితరులు



కవాడిగూడ బీమామైదాన్ వద్ద బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువజన నాయకులు ముఠాజైసింహా, డివిజన్ ప్రధానకార్యదర్శి ఎస్‌డీ సాయికృష్ణ తదితరులు

బాబుజగ్జీవన్‌రాంకు ఘన నివాళి



మహాత్మానగర్‌లో జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్

కవాడిగూడ/ముషీరాబాద్/రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. బాబుజగ్జీవన్‌రాం వర్ధంతని పురస్కరించుకొని శనివారం కవాడిగూడ బీమామైదాన్ వద్ద, భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఇందిరాపార్కు చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి కార్పొరేటర్ జి.రచనశ్రీ నివాళులు అర్పించారు. ఇందిరానగర్‌లో ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో, రాంనగర్ డివిజన్‌లోని హరినగర్ బస్తీలో బాబుజగ్జీవన్‌రాంకు నివాళి అర్పించారు.



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



కాచిగూడలో మొక్కలు నాటుతున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కార్పొరేటర్ ఉమాదేవి తదితరులు

శ్యామాప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ పోరాట పటిమను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. శనివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ విషయంలో ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ముఖర్జీ ఆశయ సాధనలో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, రాష్ట్ర నాయకులు ఎక్కాల నందు, నందకిషోర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సి.కృష్ణగౌడ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, అధికార ప్రతినిధి అజయ్‌కుమార్, సి.వినోద్‌యాదవ్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్‌లో నివాళి

బర్కత్‌పుర: జాతీయవాదం నినాదంతో భారత జాతిని ఏకం చేసిన ఘనత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీకే దక్కిందని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కాచిగూడ డివిజన్ కుత్బీగూడ, మణియార్‌పట్టి తదితర ప్రాంతాలలో మొక్కలు నాటి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, క్షీరసాగర్, ఉపేంద్ర పాల్గొన్నారు.



నల్లకుంటలోని బీజేపీ కార్యాలయంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి



బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శంకర్‌నగర్‌లో డాక్టర్ శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, నాయకులు - గోల్నాక

వర్గీకరణ జరగకపోతే నిప్పురాజేస్తాం: వంగపల్లి



మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసుకుని 30 ఏళ్లు గడుస్తున్నా సంబరాలు చేసుకోవాల్సింది పోయి వర్గీకరణ జరగకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 7న దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు తానే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పుకునే మందకృష్ణ మాదిగ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పి 10 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మాదిగ జాతిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, శ్రీను, యాదగిరి, వేణుగోపాల్, కృష్ణ, నరేష్, రాహుల్, కొల్లూరి వెంకట్, చందు, జీవన్, నాగరాజు, సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ముషీరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ బిజ్జి కనకేష్ కుమార్ అన్నారు. శనివారం ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్‌లో బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మానగర్ బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీలో మొక్కలు నాటారు.



సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులకు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రముఖ వైద్యులకు 'జీవనసాఫల్యం' ప్రదానం

చిక్కడపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పురస్కారాలు ఎంతో ప్రోత్సాహాన్నిస్తాయని ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు అన్నారు. శ్రీశ్రీనివాసం బిజే ధార్మిక గ్రంథ పరిచయ సభ శనివారం రాత్రి త్యాగరాయగానసభలో చేయూత ఫౌండేషన్, వేద విజ్ఞాన సంస్థల ఆధ్వర్యంలో జరిగింది. గ్రంథ రచయితలు డా. కేతరాజు కామేశ్వరరావు, కేతరాజు వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న త్రినాథరావు పురస్కారం ప్రదానంచేసి మాట్లాడారు. సత్యనారాయణ న్యూరోసర్జన్‌గా ప్రఖ్యాతిగాంచారని, విజయలక్ష్మి గైనకాలజిస్ట్‌గా, లీడింగ్ వైద్యులుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, బీజేపీ నేత యమున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం చర్చలు జరపాలి

రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపి న్యాయమైన వాటిని పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. సీఎం ఒకే దఫా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ ప్రకటించారు. ఏదో నామమాత్రంగా లెక్కించి ప్రతిపాదనలు పంపారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, అంజి, గొరిగె మల్లేష్‌యాదవ్, వేముల రామకృష్ణ, రేగుల మధుసూదన్‌రావు, అనంతయ్య, సతీష్‌కుమార్, బలరామ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే

అంబర్‌పేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం అందజేసి మాట్లాడారు. మహిళలు వివిధ రంగాలలో శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామారావుయాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చర్చించాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ, గ్రూప్ అభ్యర్థులు మూడు వారాలుగా రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే వారితో చర్చించకుండా కాంగ్రెస్ విద్యార్థి, యువజన నాయకులతో ప్రభుత్వం మాట్లాడడం సరికాదని వామపక్ష విద్యార్థి నాయకులు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, నాగరాజు, ఏఐవైఎఫ్ రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు మణికంఠరెడ్డి, పి.లక్ష్మణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, పీవైఎల్ నాయకుడు హరీష్ తదితరులు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు ఎం.రవికుమార్, టీఎస్. కృష్ణ, జావిద్, హాఫీ, శ్రీకాంత్, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కోయి కోటేశ్వరరావు

ఆధునికతకు ప్రామాణికం ఇనాక్ విమర్శనాసాహిత్యం

చిక్కడపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆధునికతకు ప్రామాణికం ఇనాక్ విమర్శనాసాహిత్యం అని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోయి కోటేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా ఇనాక్ విమర్శనా సాహిత్యం అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇనాక్‌ను గౌరవించుకోవడం అంటే తెలుగు సాహిత్యాన్ని గౌరవించుకోవడమేనన్నారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ విమర్శ హృదయాన్ని తాకాలని అలా రాశానన్నారు. ప్రముఖకవి పెద్దూరి వెంకటదాసు మాట్లాడుతూ విమర్శనా సాహిత్యం విసుగు కలిగించకుండా రాయగల సత్తా ఉన్న వారు ఇనాక్ అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి జెల్ది విద్యాధరరావు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రేణుక ప్రభాకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనను కనులపండుగగా నిర్వహించారు.

ఇద్దరు వ్యక్తుల అవయదానం.. 13 మందికి పునర్జన్మ



సిరికొండు ప్రసాద్, టి.నర్సింగ్‌రావు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల అవయవదానంతో పదమూడు మందికి పునర్జన్మ లభించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తుల బ్రెయిన్ డెడ్ కావడంతో వారి నుంచి సేకరించిన మూత్రపిండాలు, కాలేయం, గుండె, లంగ్స్ కార్నియా అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేశారు. వరంగల్‌కు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్ సిరికొండ ప్రసాద్ (36) గతనెల 27న బైక్‌పై వెళుతుండగా కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ కో-ఆర్డిరేటర్స్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో అవయవదానానికి అంగీకరించారు. సిరికొండ ప్రసాద్ నుంచి అవయవాలను సేకరించారు. కాగా, ఈస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన టీ.నర్సింగ్‌రావు (39) గతనెల 28న ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డారు. వెంటనే అతని ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు జరిపిస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ అవగాహన కల్పించడంతో అవయవదానానికి ముందుకు వచ్చారు. దీంతో ఇరువురి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన 13మంది బాధితులకు అమర్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

మంత్రివర్గంలో మున్నూరుకాపు సామాజికవర్గానికి చోటు కల్పించాలి

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్నూరుకాపు కార్పొరేషనుకు రూ.2వేల కోట్లను కేటాయించాలని, కోకాపేటలో ఆత్మగౌరవ భవానికి మరో రూ.20కోట్లను మంజూరు చేయాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, ఆర్వీ మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ, నర్సింగ్‌రావు, వాసాల రాజు, రాజబాబు, రవి, సాయిని శ్రీను, నిరంజన్, మొగిలి దుర్గాప్రసాద్, ఉమారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

టూవీలర్ మెకానిక్‌లను అసంఘటితరంగ కార్మికులుగా గుర్తించాలి

చిక్కడపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టూవీలర్ మెకానిక్‌లను అసంఘటితరంగ కార్మికులుగా గుర్తించి ప్రభుత్వాలు ఆదుకోవాలని టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జగన్‌గౌడ్, బల్లా ప్రశాంత్ డిమాండ్ చేశారు. ముషీరాబాద్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు సీతాబాలకృష్ణ, మనోజ్‌కుమార్, జగన్‌గౌడ్, ఓం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా వీరేందర్ గుప్తా

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైశ్యఫెడరేషన్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాంనగర్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకుడు కల్వ వీరేందర్ గుప్తా నియమితులయ్యారు. ఆయనకు నియామక పత్రాన్ని ఫెడరేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఫెడరేషన్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళిగుప్తా శనివారం అందజేశారు.

భర్త మందలించడంతో భార్య అదృశ్యం



శైలజ

కవాడిగూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భర్త మందలించాడని ఇంటి నుంచి బయటకు వెళ్లిన భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన గాంధీనగర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని బన్సిలాల్‌పేటలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సిలాల్‌పేటలో నివాసం ఉంటున్న శత్రాసిపల్లి సురేష్, శైలజ(30) దంపతులు. శైలజకు మేనమామ గూగుల్‌పే ద్వారా డబ్బులు పంపాడు. ఈ విషయంలో భర్త భార్యను మందలించాడు. ఈనెల 4న సాయంత్రం చైతన్యపురికి వెళ్లి వస్తానని పిల్లలకు చెప్పి బంగారునగలు, దుస్తులు తీసుకెళ్లిపోయి, తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మందులు కొనడానికి వెళ్లిన వ్యక్తి..

కవాడిగూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి మందులు కొనడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన దోమలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. దోమలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్సాం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లాకు చెందిన టంక బహదూర్ చెత్రి(78) దోమలగూడలోని తాళ్లబస్తీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 4న ఇంటి నుంచి మందులు కొనడానికి మందుల షాపుకు వెళ్లిన టంక బహదూర్ చెత్రి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. దీంతో అతని తనయుడు చందన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బర్కత్‌పుర, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ భానుప్రసాద్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నె మహేష్‌యాదవ్ శాలువా, పూలబోకేతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) బస్తీబాట

రాంనగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ముషీరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 15 వరకు బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. శనివారం బాగ్‌లింగంపల్లి, భగత్‌సింగ్‌నగర్ గుడిసెల వద్ద ఆ పార్టీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ముషీరాబాద్ నియోజకవర్గం పార్టీ కార్యదర్శి ఎం.దశరథ్ బస్తీబాటను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.వెంకటేష్, పద్మ, రమేష్, విమల, పాషా, మల్లయ్య, రాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

